

ఆమె నడుస్తుంది....

ఆమె వెనుక నేనూ నడుస్తున్నాను..

ఆమె వేగంగా నడుస్తుంది... నేనూ వేగంగానే నడుస్తూ ఆమెను అనుసరిస్తున్నాను

శ్రీరంగపురం దాటి పాండురంగపురం మొదటి వీధిలోకి ప్రవేశించిందామె.. మలుపు తిరిగి ఎటు వెళ్ళి పోతుందోనని నేను నడక వేగం మరికాస్త పెంచాను. .

ఆమెను ఇందాక ఆర్టీసీ కాంప్లెక్సులో చూసాను.. ఆమెతో ఎవరో ఒకతను ఉన్నాడు

ఆదివారం అని ఫస్ట్ షోకి బయల్దేరితే ఏ సినిమా టికెట్స్ దొరకలేదు. అందుకే తిరిగి ఇంటికి వెళ్ళిపోదామని కాంప్లెక్సుకు వెళ్తే అక్కడ ఓ స్థంభం చాటున మాట్లాడుకుంటున్న వాళ్ళిద్దరూ నా దృష్టిలో పడ్డారు

ఎందుకో వాళ్ళు మాట్లాడుకొనే విధానం నాకు కాస్త అనుమానాన్ని కలిగించింది ..

చుట్టు ప్రక్కల వారిని ఓ కంటితో గమనిస్తూ ఆమె అతనితో మాట్లాడుతుంది... అతను కాసేపు సీరియస్‌గా, మరి కాసేపు వెకిలిగా నవ్వుతూ ఆమెతో గుసగుసలాడుతున్నాడు మధ్య మధ్యలో ఆమె తల అడ్డంగా ఊపుతుంది అతను ఆమెను వారిస్తున్నట్టుగా, బ్రతిమలాడుతున్నట్టుగా మాట్లాడుతున్నాడు

ఆఖరుకు ఆమె అలాగే అన్నట్టుగా తలూపింది . అతను వాచీ వైపు చూసి ఏదో చెప్పి వెళ్ళి పోయాడు.

ఒక నిముషం అక్కడ నిలబడి ఆమె బయల్దేరింది....

ఇంటికి వెళ్ళినా బోరు కొట్టడమే తప్ప ఇంకే ముందని అనుకొని నేను కూడా ఆమెకు తెలియకుండా అనుసరించాను.

రెండు చోట్ల రిక్షాల్ని బేరమాడింది గానీ బేరం కుదరలేదేమో ఆమె నడిచే వెళ్తుంది .

ఆ మలుపు తిరిగిన నాకు మరో వీధిలోకి మళ్ళుతూ ఆమె కన్పించింది...

ఎక్కడ ఆమె కన్పించకుండా పోతుందోనని నేను ఆమెనే గమనిస్తూ నడుస్తున్నాను .

అంతలో నన్నెదో గుద్దింది .. నేను ప్రక్కకు పడిపోబోయి నిలదొక్కుకున్నాను . నన్ను గుద్దేసి ఓ సైకిలతను క్రింద పడిపోయాడు. నన్నేదో అంటు (తిడుతు)న్నాడు గానీ నేనేదో చెప్పేసి ఆమె వెళ్ళిన వీధిలోకే నేనూ వెళ్ళేను .

సరిగ్గా అప్పుడే లైట్లు వెలిగాయి ఆ వీదిలో

ఆ వెలుతుర్లో ఆమె కోసం నా కళ్ళు ఆత్రంగా వెదుకుతున్నాయి గానీ ఆమె నాకు కన్పించలేదు...

ఒక నిముషం అక్కడే నిలబడి పరిసరాల్ని గమనిస్తున్న నాకు ".... వస్తారా?. ." అన్న ప్రశ్న వినబడి ప్రక్కకు తిరిగి చూసాను. .

ఎదురుగా ఓ యువకుడు...

సన్నగా, పీలగా ఉన్నాడతను... గళ్ళ బనీనును మాసిపోయిన తెల్ల ఫాంటులోకి ఇన్ చేసాడు... నములుతున్న కారా కిళ్ళీని బుగ్గ మార్చుతూ నా వైపు చూసి అదోలా నవ్వుతున్నాడు.

. ఎక్కడికి?. ." అని అడిగాను.

ఒక కన్నును అదోలా కొడుతూ తల ఎగరేసాడు... అతను తల నెగరేసిన వైపుకి చూసాను. ఆ వీధిలోనే మరో చిన్న సందు ఉంది...

అటు వైపుకి చేయి చూపిస్తూ . ."రండి, కొబ్బరి ముక్కల్లాంటోళ్ళున్నారు... ఇప్పుడే ఓ కొత్త పిట్ట కూడా వచ్చింది .." అన్నాడు..

నేను కాస్త సంశయించాను...

'రేటు గురించి ఆలోచించకండి, నేను బేరమాడి పెడ్తాను రీజనబుల్‌గానే ఉంటుంది."

ఇప్పుడే క్రొత్త పిట్ట వచ్చింది. .' అన్న వాడి మాట విన్నాక నాకు 'ఆమె' గుర్తొచ్చింది . ఒకవేళ

ఆ క్రొత్త పిట్ట అమేనేమో!? అన్పించింది...

నా ముఖ కవళికల్ని బాగా గమనిస్తున్న ట్టున్నాడు "... ఆలోచించకండి సార్, రండి సార్!" అన్నాడు వాడు

ఇలాంటి సంఘటనలు ఇంతకు ముందు కొన్ని సార్లు ఎదురయ్యాయి గానీ నేనెప్పుడూ అడుగు ముందు కేయలేదు .. కానీ ఇప్పుడు ఆ అమ్మాయి అక్కడ ఉంటుందేమో అని అన్పించి మాత్రమే ఇంత వరకూ అక్కడ నిలబడడం జరిగింది...

వాడలా అడిగిన తర్వాత .. "ఆ అమ్మాయి అక్కడ ఉంటే ఏమిటట? ఉంటే మాత్రం నేనెందుకెళ్ళాలిట?" అని అన్పించింది...

అందుకే " అక్కర్లేదు!" అని చెప్పేసి అక్కడ నుండి చకచకా నడచుకుంటూ వెళ్ళి పోతుంటే వెనుక నుండి... "ఎర్రి బాగులాడులా ఉన్నాడీడు" అని వాడన్న మాట విన్పించింది గానీ నేను వాడినేమీ అనలేదు, అసలు వెనక్కి తిరిగి చూడలేదు...

ఆ ఏరియా నుండి బయట పడ్డాక అప్పుడు నా కన్పించింది. కాంప్లెక్సులో వాళ్ళను చూసి అసలు నేనెందుకు ఆ అమ్మాయి వెంట వెళ్ళాను? ఆ అమ్మాయి ఎవరో, ఎందుకు వెళ్తుందో తెలుసు కోవాలన్న ఉబలాటం నాకెందుకు కలిగింది?

అయినా ఆ అమ్మాయి ఎలాంటిదైతే నాకెందుకు?

వాచీ చూసుకున్నాను... ఏడు గంటలయ్యింది .. ఈ గంట సేపూ నేను చేసిన నిర్వాకం తలచుకుంటే నా మీద నాకే చిరాకేసింది'

ఆ రాత్రంతా నాకు 'పాణి' మాటలే గుర్తొచ్చేయి'

* * * *

ఆ రోజు ఆఫీసులో నా కొలీగ్ పాణి వచ్చి "ఇంటి దగ్గర ఖాళీయే కదా, సాయంత్రం అలా రూమ్‌కు రావోయ్!" అన్నాడు.

"విశేషం ఏమైనా ఉందా?" అని అడిగాను...

"విశేషాన్దేముంది, ఏదైనా ప్రోగ్రాం వేసుకుందాం!" అన్నాడు...

"అలాగే, ఇంటికి వెళ్ళి వస్తాను ...' అన్నాను

ఆత్మహత్య

నేను...

ఆ రోజు సాయంత్రం ఇంటికి వెళ్ళి ఆరు గంటలకి పాణి రూమ్‌కి వెళ్ళాను... పాణి రూమ్‌లో రిలాక్స్‌డ్‌గా కూర్చున్నాడు..

"నీ కోసమే ఎదురు చూస్తున్నాను... రా!" అన్నాడు...

నేను వెళ్ళి అక్కడున్న పేము కుర్చీలో కూర్చున్నాను...

"సినిమాకు వెళ్దామా?" అని అడిగాను పాణిని...

" సెకండ్ షోకి వెళ్దాంలే!" అన్నాడు పాణి....

"హాల్సన్నీ ఈ ప్రక్కనే కదా, ఫస్ట్ షోకే వెళ్దాం..." అన్నాను..

"సినిమా కంటే మంచి ప్రోగ్రామ్ ఉండొచ్చు ఇప్పుడు...."

"ఏమిటి?"

". .. నాలుగు రోజుల క్రితం అనుకోకుండా అటు వైపుకి వెళ్తే ఓ మంచి 'ఫామిలీ బైపు' దొరికింది. ఆ రోజు అక్కడ ఓ గంట ఉండి వచ్చేసాను గానీ పెద్దగా సాటిస్‌ఫాక్షన్ కలగలేదు... వచ్చేసేటప్పుడు అదే అంది, ఎప్పుడైనా ఉండాలంటే కబురు పెట్టండి అని! అనుకోకుండా ఇందాక ఆఫీసు నుండి రూమ్‌కి వస్తుంటే ఆ బ్రోకరు గాడు కన్పించాడు, నా రూమ్‌లో నే ఏర్పాటు చెయ్యమని చెప్పేను... వాడు అదే పని మీద వెళ్ళాడు, ఇంకా సేపట్లో పిట్ట వచ్చేయొచ్చు .." అన్నాడు పాణి....

"అయితే' ఇంక నేనెందుకు? వస్తాను.. ' అని లేవబోయాను....

"ఉండు గురూ, నువ్వూ ఓ చూపు చూద్దువు గాని....!"

'నాకలాంటివి...."

"ఇష్టం లేదని అంటావ్, అంతే కదా? పోనీ అది వచ్చే వరకూ ఉండు... తర్వాత వెళ్దువులే! రాకపోతే ఫోంచేసి పిక్చర్‌కి పోదాం!" అన్నాడు....

పాణికి ఇలాంటివి ఉన్నాయని నాకు తెలుసు... కానీ ఆఫీసులో నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటాడు... అప్పుడప్పుడూ సినిమాలకు వెళ్తుంటాం... ఇలాంటి వాటిల్లో తనకు చాలా అనుభవం ఉందని, నన్ను కూడా రమ్మని చాలా సార్లు అన్నాడు గానీ నేనెప్పుడూ ఇలాంటి వాటిలో అతనికి కంపెనీ ఇవ్వలేదు....

'జీవితం అన్నది అనుభవించడానికే గానీ, ఇలా మడి కట్టుకొని కూర్చోడానికి కాదు' అని చాలా సార్లు ఎన్నో రకాలుగా చెప్పాడు పాణి... నేను నవ్వి తప్పుకున్నానే గానీ అతనితో వాదించలేదు...

'మీలాంటి వాళ్ళు కోరికల్ని ఎందుకో అణచు కుంటారు... నీతి, నియమం, శీలం ఇలాంటి పదాల్ని వాడి తప్పుకుంటారు గానీ మీ మనసు పొరల్లో ఎక్కడో ఓ మూల ఇలాంటి కోరికలు దాగి ఉంటాయి... కాదంటే నేనేం చెప్పలేను గానీ పిరికితనానికి, సంఘం పట్ల ఉన్న భయానికి నీతుల్ని పులిమి ఆత్మవంచన చేసుకుంటారు!'... అనేవాడు...

ఆ మధ్య నేను ఆర్టీసీ కాంప్లెక్సు నుండి ఆమెను అనుసరించి వెళ్ళిన ఆ రాత్రంతా నాకు పదే పదే గుర్తొచ్చిన మాటలు అవే!

నిజంగా నాలోనూ అలాంటి కోరికలు ఉన్నాయా? నాది పాణి అన్నట్టు ఆత్మవంచనా? పాణి తన ధోరణిలో తను మాట్లాడుతున్నాడు... అలా ఓ అరగంట గడిచింది... అంతలో... "గురూ గారూ!" అన్న పిలుపు వినబడి గుమ్మం వైపు చూసాను...

అతను....

ఆ రోజు ఆర్టీసీ కాంప్లెక్సులో స్థంభం చాటున 'ఆమె' తో మాట్లాడినతను...

"ఏమైంది రామస్వామీ?" అని అడిగాడు పాణి...

"ఏమవ్వద్దండి, పండే! అరగంటలో వస్తాది, అడ్వాన్సు కొట్టించండి..." అని చేయి చాచాడు... పాణి ఏభై రూపాయల నోటు అందించాడు వాడికి...

"వస్తానండి..." అని నా వైపు చూస్తూ 'ఇంకో పిట్టని కూడా తెమ్మంటారేంటి?' అన్నాడు...

పాణి నవ్వుతూ "వద్దులే!" అన్నాడు....

వాడు వెళ్ళిపోయాడు....

"సెకండ్ షోకి దాన్ని కూడా తీసుకెళ్దాం, నీకేమైనా అభ్యంతరమా?" అని అడిగాడు పాణి...

నిజానికి నేనలాంటి సమయాల్లో నిష్క్ర మిస్తాను.... కానీ 'వాడిని' చూసాక ఆ వచ్చేదెవరో చూసి అప్పుడు వెళ్దామని అన్పించింది...

అందుకే పాణి అడిగిన దానికి అవునని, కాదని ఏమీ చెప్పలేదు... పాణి కూడా ఇంకేమీ అడగకుండా కబుర్లలో పడ్డాడు...

పది నిముషాలు గడిచాక... "రాజా, ఒక్క పావు గంట మ్యాగజైన్స్ తిరగేస్తూ కూర్చుంటావా, బయటికి వెళ్ళొస్తాను?" అన్నాడు పాణి. .

"ఎక్కడికి....? నేనూ వస్తాను పద...." అన్నాను...

"నేను వెళ్తుంది 'సరంజామా' తీసుకు రావడానికి ... నువ్వవన్నీ తిరగలేవు గానీ కూర్చో, మళ్ళీ తలుపులూ అవీ క్లోజ్ చేసుకోవాలి!" అన్నాడు పాణి....



తొలకరి

తొలకరి గర్జించింది
పుడమి తల్లి ఒడలు
పులకరించింది
వర్షాలు, వర్షాలు
వరదలు వచ్చి
భూములు తడిసి
నదులు నిండి
ఏరులు పొంగి
రైతుకు ఊపిరి వచ్చింది.
చింతకు చిగురు వేసింది
కడిమి చెట్టు పూలతో ఎరుపెక్కింది
గంగరావి పూలతో
తెల్లటి మల్లిలు
అక్కడక్కడా
స్వచ్ఛంగా ముత్యాలు
కనిపించాయి
భూమిలోని వజ్రాలు
తొంగిచూశాయి
తొలకరి వచ్చింది
ఆకాశంలో మేఘాల
పరుగులు రోడ్డు ప్రక్క
కాల్వలలో కాగితాల
పడవల పరుగులు
ఆనందం – ఆనందం అంతా
అంతా ఆనందం.

–ఎం. ఎస్. ఎం.

"సరే, వెళ్ళి వేగంగా రా!" అన్నాను...

పెద్ద కేరేజీ, ఓ బ్యాగూ పట్టుకొని బయల్దేరాడు పాణి. . నేను అక్కడే ఉన్న టీపాయ్ మీద ఉన్న పత్రికల్ని తీసుకొని తిరగెయ్యడం మొదలు పెట్టాను...

మరో పది నిముషాలు గడిచిం తర్వాత... "ఏవండీ!" అన్న పిలుపు విన్పించింది... అది స్త్రీ కంఠం కావడంతో చటుక్కున తలెత్తి గుమ్మం వైపు చూసాను....

గుమ్మం దగ్గర నిలబడి ... 'ఆమె'...

ఆమే!

ఆ రోజు ఆర్టీసీ కాంప్లెక్సులో రామస్వామితో మాట్లాడుతూ కన్పించిన ఆమే!

నాకు ఏం మాట్లాడాలో, ఏం అనాలో తోచలేదు... ఆమే రూంలోకి వచ్చి అక్కడ నాకెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంది చొరవగా....

"ఆయన లేరా?" అని అడిగింది ఆమె...

"బయట కెళ్ళేడు ... వస్తాడు" అన్నాను...

ఒక నిముషం వరకూ ఆమె ఏమీ మాట్లాడ లేదు... నేను కూడా పత్రికలో తల దూర్చేసి కూర్చున్నాను... నాకక్కడ కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంది....

రామస్వామిని చూసి ఇంత వరకూ ఇక్కడ ఉన్నది ఎవరొస్తారో చూద్దామనే! నేననుకుంటూనే ఉన్నాను.... నేననుకున్నట్టుగానే....

"మీరూ ఉంటారా?"

ఆమె వేసిన ఆ ప్రశ్నకు చటుక్కున పుస్తకం లోంచి తలెత్తి ఆమె వైపు చూసాను...

ఆమె ముఖంలో ఎలాంటి భావమూ లేదు... కానీ నాలోనే చాలా అలజడిగా ఉంది...

" ..అహఁ..." గొంతు పెగలడం కష్టమయ్యింది...

తర్వాత ఏమీ అనలేదు ఆమె...

మరో అయిదు నిమిషాలు గడిచింది... పాణి ఇంకా రాలేదు... 'వస్తే బాగుణ్ను' అని, 'మరి కాస్సేపు పోయాక వస్తే బాగుణ్ను' అని రెండు విధాలా అన్పిస్తుంది నాకు...

అప్పటికి నేను కాస్త ఫ్రీనెస్ ఫీలయ్యాను...

ఆమెతో నాకేదో మాట్లాడాలని అన్పిస్తుంది...

"ఎప్పట్నుంచి చేస్తున్నావీ పని?" నెమ్మదిగా అడగడం మొదలుపెట్టాను....

"సరిగ్గా గుర్తు లేదు గానీ, రెండేళ్ళు అయ్యుండొచ్చు...."

"ఇలాంటి పని ఎందుకు చేయడం?"

"మీరు ఉద్యోగం ఎందుకు చేస్తున్నారు?"

నా ప్రశ్నకు ఎదురు ప్రశ్న ... నేనూహించలేదు ఆమె అలా అడుగుతుందని...

"ఉద్యోగం చేయకపోతే ఎలా? బ్రతకాలిగా?"

"మీరు ఉద్యోగం చేస్తుంది మీరు బ్రతకడానికి ... కానీ నేనీ పని చేస్తుంది బ్రతికించుకోడానికి..."

"... ఎవర్ని?" అప్రయత్నంగా నా నోటి నుండి ఆ ప్రశ్న వచ్చింది...

".... నా బిడ్డను...."

"పిల్లలున్నారా నీకు?"

"ఒక ... బాబున్నాడు...."

"అంటే ... పెళ్ళయ్యిందా?"

"ఆఁ...."

"అతను లేడా?"

"ఉన్నాడు...."

"అతనుండగా... "

"మీ అనుమానం నాకు అర్థమయ్యింది. మీరిక్కడికి ఎన్ని గంటలకు వచ్చారు?"

"ఆరింటికి..."

"అయితే మీరతన్ని చూసే ఉంటారు...."

"ఎవరు?"

"రామస్వామి... కంపెనీ దగ్గరకు నేనివాళ రాన చెప్పడానికి వెళ్ళి దార్లో ఇటొచ్చి అడ్వాన్సు తీసుకున్నాడట... మళ్ళీ నాతో వచ్చి ఇక్కడే దింపే వెళ్ళిపోయాడు...

"అతనా ..?"

"అవును... నా భర్త అతనే!"

ఆ మాట విని నేను మ్రాన్పడిపోయాను...

"ఎందుకంత ఆశ్చర్యపోతారు?"

"................ "

"మిమ్మల్ని చూస్తుంటే ఈ సమాజంలో కుళ్ళుకు దూరంగా పుట్టి పెరిగారన్పిస్తుంది.... ఈ విషయం తెలిసిన చాలా మంది ఎప్పుడూ దీన్ని పెద్దగా పట్టించుకోలేదు ..."

కాసేపయ్యాక నేనే అడిగాను... "అలాంటి వాడిని ఎందుకు పెళ్ళి చేసుకున్నావు?" అని...

"అలాంటి వాడని తెలియక ... పెళ్ళి చేసుకోడానికి ఎవరూ దొరకక, దొరికిన వాడు చేజారి పోతాడేమోనన్న తొందరలో ముసలి మా అమ్మ వీడికిచ్చి చేసేసి, వెంటనే ఆవిడ పైకి వెళ్ళిపోయింది. పిల్లాడు పుట్టిన తర్వాత తెలిసింది వీడి అసలు స్వరూపం!"

"నిన్ను రామస్వామితో క్రిందటి ఆదివారం చూసాను ఆర్టీసీ కాంప్లెక్సులో ..."

"అప్పుడు నేను విజయనగరం వెళ్ళేను పిల్లాడికి ఒంట్లో బాగుండనప్పుడు చేసిన మొక్కుబడి తీర్చడానికి... బస్సు దిగీ దిగంగానే బాబుని చూడకుండా ఏదో బేరం ఉందని కంపెనీ దగ్గరున్న తాయారమ్మ దగ్గరికి ఎల్లమన్నాడు... అప్పుడు మీ ఫ్రెండు ఉన్నాడక్కడ... విషయం చెప్పి తొందరగా వెళ్ళాలని, కావాలంటే మరోసారి కలుద్దామని,

త్వరలో ప్రారంభం!

సుప్రసిద్ధ రచయిత్రి

శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్

కొత్త సీరియల్ నవల

మంజీర నాదం

రామస్వామికి చెప్తే ఎక్కడికైనా తీసుకొస్తాడని చెప్పి మొత్తానికి ఆ రోజు ఏడున్నరకి బాబు దగ్గరికి వెళ్ళాను....

"విజయనగరం బాబుని కూడా తీసుకెళ్ళొచ్చుగా?"

"అక్కడ సంబరాల్లో చాలా రద్దీగా ఉంటుందని, బాబు నలిగిపోతాడని తీసుకెళ్ళలేదు.రామస్వామి దగ్గరుండి చూసుకుంటానని చెప్తే నమ్మి వెళ్ళేను... తీరా కాంప్లెక్సులో దిగేసరికి బస్సు గుమ్మం దగ్గిరే నిలబడి ఉన్నాడు రామస్వామి...."

అలా అన్నీ చెప్పుకొచ్చింది ఆమె...

మధ్యలో నేనడిగాను.... 'నీ పేరేమిటి?'... అని...

జవాబుగా నవ్వింది ఆమె... ఆ తర్వాత చెప్పింది ... 'సీత' అని!

రామస్వామి అలా చేస్తే ఊరుకోవడం ఎందుకని, వాడ్ని ఎదిరించలేకపోయావా అని చాలా ప్రశ్నలు వేసాను ఆ తర్వాత. .

అన్నింటికీ సమాధానంగా ... "నిజానికి నాకీ బ్రతుకు మీద మోజు లేదు.. ఎప్పుడూ చచ్చిపోవాలనే అన్పిస్తుంది . కానీ నా బాబుని చూస్తుంటే చావ బుద్ధి కావడం లేదు... అందుకే ఇలా శవంలా బ్రతుకుతున్నాను... బ్రతకలేక ఎందరో ఈ దారికి వచ్చేసిన వాళ్ళను చూసాను. వాళ్ళు సంపాదించింది అంతా వాళ్ళకు చేరదు కూడా! రామస్వామి చిన్న సైజు రౌడీ, అతని జోలికి ఎవ్వరూ రారు... ఆడదాని కష్టం మీద బ్రతికే బ్రోకరుగాళ్ళ మధ్య ఎందరో అన్నానికి కూడా మిగుల్చుకో

లేకపోతున్నారు. రామస్వామి మొగుడు లాంటి బ్రోకరు, బ్రోకరు లాంటి మొగుడు కావడం వల్ల చాలా మందికి లేని రక్షణ నాకు ఉంది... వాడి ప్రయత్నం అంతా డబ్బు సంపాదించడమే! అందుకు వాడు ఎందరినో తార్చి డబ్బు సంపాదిస్తాడు... పెళ్ళాన్నైన నన్ను కూడా తార్చుతున్నాడు గానీ, నన్ను పెళ్ళం లాగే ఓ వేరే ఇంట్లో పెట్టి చూస్తున్నాడు .. ఆ కాస్త రక్షణ లేని వాళ్ళ కంటే నేను చాలా నయం అనుకొని ఇలాగే కాలాన్ని ఈడ్చుతున్నాను.... నా బాబు కోసం, వాడి భవిష్యత్తు కోసం నేనేమైపోయినా ఫర్వాలేదని అలాంటి వాడి నీడలోనే ఇష్టం లేకున్నా ఉంటున్నాను....

.. అలా చాలా చెప్పుకొని వచ్చింది సీత... గజిబిజిగా చెప్పినా ఆమె చెప్పిన ముఖ్యమైన విషయం ఏమిటంటే తన కొడుకు కోసమే తనిలాంటి బ్రతుకుని రామస్వామి లాంటి వాడితో గడుపుతున్నానని!

అయితే ఆమెను చాలా ప్రశ్నలు వెయ్యాలన్పించింది గానీ ఆమె వాటికి సమాధానం చెప్పలేకపోవచ్చని, ఆ పరిస్థితుల్లో ఆమెకు అంతకంటే వేరే దారి లేక అలా రాజీ పడిపోయి ఇంక ఏ ఆలోచనా లేకుండా కళ్ళలో కొడుకుని పెట్టుకొని కాలాన్ని గడిపేస్తుందని... అనుకొని ఇంక నేనేమీ ప్రశ్నలు వెయ్యలేదు ...

కానీ. . మళ్ళీ నాలో ఓ ప్రశ్న పుట్టి సీతను అడుగుదామనుకున్నాను గానీ అంతలో ఆమె అడిగింది 'మీ ఫ్రెండు ఇంకా రాలేదేమిటి?' అని...

"వస్తాడు.. బయటకు వెళ్ళాడు.... ఇంతకూ మా ఫ్రెండు ఎలా గుర్తున్నాడు నీకు?" అని అడిగాను...

నా ప్రశ్నకు ఆమె చిన్నగా నవ్వింది...

"ఎందరో. .. అందరూ గుర్తుండరు. కానీ కొందరు మాత్రం గుర్తుండి పోతారు.... ఆ రోజు ఇంటికి వెళ్ళాలన్న తొందరలో ఉన్నాను కదా, మీ ఫ్రెండు నా తొందరకు పెద్దగా విసుక్కోలేదు .. అలా విసుక్కోని వాళ్ళు చాలా కొద్దిమంది ఉంటారు... పైగా తీసుకొచ్చేటప్పుడు రామస్వామి గుర్తు చేసాడు కూడా క్రిందటి ఆదివారం, నేను విజయనగరం నుండి వచ్చేసరికి బుక్కై ఉన్న పాసింజరే ఈ రోజు రూమ్‌కు తీసుకు రమ్మన్నాడని.....

ఆమె ఇంకా ఏదో చెప్పబోతుంది గానీ అంతలో పాణి వచ్చాడు 'సరం జామా' పట్టుకొని....

పాణితో వెళ్ళొస్తానని చెప్పి లేచాను...

"ఇదేమిటి, సినిమాకు వెళ్దామనుకున్నాంగా?"

"సారీ, వస్తాను... యూ కేరీ ఆన్" అని చెప్పేసి అక్కడి నుండి బయల్దేరి పోయాను. .

★ ★ ★ ★

చాలా రోజుల తర్వాత పాణి, నేను మేట్నీకి వెళ్ళాం... సినిమా అయిపోయిం తర్వాత "పాణీ.

ఆంధ్రపత్రికలో

నమ్మదగిన వార్తలు, వ్యాఖ్యలేకాదు!
చదవదగిన విశేషాలు, శీర్షికలు
— ఎన్నో వుంటాయ్!! —

ధర్మపథం — ఆహారాన్ని గురించి

"అదభక్షణే" అనే ధాతువును బట్టి వచ్చిన పదం అన్నం. ఆహారపదార్థాలు అనేకం ఉన్నా, అవి తృప్తిని కలిగించవు. అన్నం తింటేనే కడుపునిండుతుంది. "అన్నం పరబ్రహ్మ స్వరూప" మని అంటారు. ముక్తి పొందుటకు బ్రహ్మ జ్ఞానానికి ఎట్టి ప్రాధాన్యమో, శరీరధారణకు అన్నం అంతముఖ్యమైనది. ఆకలిచే నకనకలాడు తున్న వానికి కూటి మీదనే ధ్యానం. వానికి తత్వోపదేశం చెవి కెక్కదు. కడుపునిండా తిని ఉన్న వానికి ఏమి బోధించినా తలకెక్కుతుందీ. అందువల్లనే మనవారు అన్ని ధర్మాలకన్నా అతిథికి అన్నం పెట్టడమే ముఖ్యమని చెప్పారు.

ఆకలితో బాధ పడుతూ 'అన్నమో రామచంద్రా!" అని ప్రాధేయపడుతూ గుమ్మంలో మనిషి ఉండగా, అతనికి పెట్టకుండా తినేవానికి మహాపాపం! అంతేకాదు, అతని కుటుంబానికే హాని కలుగుతుంది. ఈ సంగతి మన ఉపనిషత్తుల్లోనే విశదంగా చెప్పబడింది. తండ్రి కోపానికి గురియై, మరణ శిక్షకు గురి యైన నచికేతుడు యముని యింటికి వెళ్ళాడనీ, ఆ సమయంలో యముడు గృహంలో లేడనీ, ఆయన వచ్చేవరకూ నచికేతుడు మూడు రోజులు ఆహారం లేకుండానే ఇంటి బయట నిరీక్షిస్తూ ఉన్నాడనీ, యముడు వచ్చి 'అన్నం లేకుండా అతిథి గృహ బహిర్భాగంలో ఉండడం మహాపాప" మని



గ్రహించి, అతనికి ఆతిథ్యం ఇవ్వడమే కాకుండా, మూడు రోజులు నిరీక్షించి ఉన్నందుకు మూడు వరాలిచ్చినట్లు కఠోపనిషత్తు వల్ల తెలుస్తున్నది. యముని వంటి వాడే ఇలా భయపడినప్పుడు, అతిథికి అన్నం పెట్టని వారి సంగతిని వేరే చెప్పవలసిన పని లేదు.

ఆకలితో బాధ పడుతున్నప్పుడు, అట్టివానికి ఏవిషయమూ తలకెక్కదంటే – ఆధ్యాత్మిక విషయాలు' ఎలా తల కెక్కుతాయి? ఈ విషయాన్ని గ్రహించే స్వామీ వివేకానందుడు విశ్వవ్యాప్తంగా దీన జనోద్ధరణకు గట్టి కృషి చేసి కృతార్థుడైనాడు! ఆ మహనీయుడు గత శతాబ్ది చివర అమెరికాలో జరిగిన విశ్వ మత మహాసభలో మహోపన్యాసా లిచ్చి యావత్ప్రపంచాన్నీ ఆకట్టుకొన్నప్పుడు సభ్యులను చూచి "మీరు జనాన్ని ఉద్ధరించ దలచితే, మత ప్రచారానికయి తత్వ వేత్తలను భారత దేశానికి పంపనక్కర్లేదు. మాకు తత్వ విజ్ఞానానికీ, తత్వ వేత్తలకూ కొరత ఏమీ లేదు. కొరత అహారంలో మాత్రమే ఉన్నది. అందువల్ల ధన సహాయం చేస్తే ఆ దీనులను ఉద్ధరించినట్లే" అని అన్నాడు. ఉదారు లిచ్చిన ధనంతో క్షుధోర్తు లైన దీనులకు ఎన్నో సంస్థలు ఏర్పరచాడు ఆ మహనీయుడు! తిండిలేక ఏపనీ చెయ్యడం సాధ్యంకాదు. ఈ నాగరక కాలంలో కూడా ఆకలి చావులు ఉన్నట్లు పత్రికల వల్ల తెలుస్తూ ఉన్నది. ఎన్నో తగవులు, కలహాలు ఈ సమస్య వల్లనే ఏర్పడు తున్నవి.

–బులుసు వేంకటరమణయ్య

వేనొస్తాను మరి..." అని చెప్పి ఇంటికి బయల్దేరబోయాను...

"కాస్త రిఫ్రెష్ అయి వెళ్ళువు గాన్లే గానీ రూమ్‌కి వెళ్దాం పద ముందు..." అన్నాడు పాణి...

"ఏం, మళ్ళీ అలాంటి ప్రోగ్రాం గానీ పెడతావా ఏమిటి?" నవ్వుతూనే అన్నాను...

నా మాటకు పాణి నవ్వుతూ ...."ఛ...ఛ... అలాంటిదేమీ లేదు" అని ... మళ్ళీ ఏదో గుర్తు వచ్చిన వాడిలా సడన్‌గా ఆగిపోయి నన్ను రోడ్డు ప్రక్కకు తీసుకు వెళ్ళి...

"రాజా! నువ్వు ప్రోగ్రాం అంటే గుర్తొచ్చింది, నీకో విషయం చెప్పడం మరిచేపోయాను... ఆ రోజు నువ్వుండగా ఒకర్తి వచ్చింది గుర్తుందా?" అని అడిగాడు....

"ఆ...."

"మొన్న ఆ రామస్వామి గాడు కన్పించినప్పుడు దాని గురించి అడిగాను... పిచ్చిది, కొడుకు మెదడు వాపు వ్యాధి వచ్చి చచ్చిపోయాడని అది కూడా ఆత్మహత్య చేసేసుకుందట!" అన్నాడు...

పాణి అన్న మాటలు విని నేను త్రుళ్ళి పడ్డాను..

ఆ తర్వాత నేనింకేమీ మాట్లాడలేకపోయాను...

ఓ పది నిముషాలు పాణితో ఎలా నడిచానో తెలీదు, పనుందని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాను....

ఆ రోజు ఆర్టీసీ కాంప్లెక్సు నుండి సీతను చాలా సేపు అనుసరించడం, ఆ తర్వాత రామస్వామి కన్పించడం, ఆ రోజు సీతతో మాట్లాడ్డం, ఇప్పుడు పాణి చెప్పిన విషయం...

అంతా ఒక కలలా....

నా మనసు మనసులో లేదు....

సీతలాంటి వాళ్ళ జీవితాలకు పరిష్కారం బలవంతంగా ప్రాణాలు తీసుకోవడం కాదన్నది నా స్వంత అభిప్రాయం! అయినా సీత అలా చేసిందని తెలిసినా ఎందుకో ఆమెను అభినందించకుండా ఉండలేకపోయాను...

కేవలం కొడుకు కోసమే బ్రతుకుతున్నానని చెప్పిందప్పుడు... ఇంక ఆ కొడుకు లేకపోవడం వల్ల బ్రతకడం అనవసరం అనుకుందేమో, అందుకే ఆత్మహత్య చేసుకుంది సీత!

కానీ...

నేను....

అలాంటి ఆడవాళ్ళ జీవిత పరిష్కారం ఆత్మహత్య కాదన్నది నా అభిప్రాయం అయినా... సీత చేసిన పనికి నాకు తెలియకుండానే మనసులో ఆమెను అభినందించాను...

ఒక రకంగా నేను నా ఆత్మను హత్య చేసేసానేమో!? కదూ....!? □